


అక్రమాల్లో రా'రాజు'

కోహెడ మండలం నాగసముద్రాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడ్డాడు. వివరాలు 8లో ▸



'రాజీవ్ యువ వికాస్'..

రాజీవ్ యువ వికాస్ పథకం అగ్రవర్ణ పేదలకు వర్తింపజేయాలని రెడ్డి జేఏసీ డిమాండ్ చేసింది. వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ప్రాజెక్టు డైరెక్టర్ దామోదర్‌రావు

మద్దూరు(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేపట్టాలని ప్రాజెక్టు డైరెక్టర్ దామోదర్‌రావు అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్టులో ఎంపికైన కూటిగల్, ధర్మారం గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అదేవిధంగా రేబర్తి గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, అనిత, మాధవ్, అశోక్, ఐలయ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సమేతంగా మోదీని కలిసిన ఎంపీ



ప్రధానమంత్రి మోదీతో ఎంపీ రఘునందన్‌రావు, కుటుంబ సభ్యులు

దుబ్బాక: మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీని కలిశారు. పార్లమెంట్‌లోని పీఎం ప్రత్యేక కార్యాలయంలో ఎంపీ తన సతీమణి మంజుల, కూతురు సింధు, అల్లుడు, మనవరాళ్లతో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తన మనువరాళ్లను మోదీ ఎంతో ఆప్యాయంగా ఎత్తుకొని చాక్లెట్లు ఇచ్చి, వారితో కాసేపు ఆడుకున్నారని ఎంపీ 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. తమ కుటుంబంతో పీఎంను కలవడం సంతోషంగా ఉందన్నారు.

మహిళలకు అండగా 'రుతుప్రేమ'

డీపీఓ దేవకీదేవి



మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

అక్కన్నపేట(హుస్నాబాద్): మానవ మనుగడను శాసించే పవిత్రమైన ప్రక్రియ రుతుచక్రమని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) దేవకీదేవి అన్నారు. అక్కన్నపేట మండలం జనగామలో రుతుప్రేమపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు బాగుంటేనే సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ఆరోగ్యకరమైన, పరిశుభ్రత నిర్వహణ పద్ధతులను అవలంబించడానికి రుతుప్రేమ ఒక అవకాశమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి రమ్య, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎగ్గిడి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు ప్రత్యేక చర్యలు

దుబ్బాక: ప్రభుత్వం క్షయవ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం దుబ్బాకలోని బస్తీ దవాఖానాను సందర్శించి క్షయ నివారణపై చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయను ప్రైమరీ దశలో గుర్తిస్తే వ్యాధిని నివారించవచ్చన్నారు. ఎడతెరిపి లేని దగ్గు, జ్వరం వచ్చి తగ్గిపోవడం, ఆకలి మందగించడం, బరువు తగ్గిపోవడం లాంటి లక్షణాలు ఉంటే తెమడ పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, రాజు, సరస్వతి తదితరులు ఉన్నారు.

మోయతుమ్మెద వాగులోకి నీరు వదలండి



రైతులను సముదాయిస్తున్న పోలీసులు

నంగునూరు(సిద్దిపేట): రంగనాయకసాగర్ నీటిని మోయతుమ్మెద వాగులోకి వదలాలని డిమాండ్ చేస్తూ గురువారం అక్కెనపల్లి రైతులు రాంపూర్ క్రాస్‌రోడ్డు వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు చేతికందే సమయంలో నీరు అందక ఎండిపోతున్నాయన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.



తోటి మిత్రులకు ఆల్‌ది బెస్ట్ చెబుతున్న పదోతరగతి విద్యార్థినులు

విజయోస్తు..

నేటి నుంచి పది పరీక్షలు ● ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి వచ్చే నెల 4 వరకు జరిగే పరీక్షలకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో 14,124 మంది విద్యార్థులు 79 సెంటర్లలో పరీక్షలు రాయనున్నారు. పరీక్ష హాల్లో హాల్‌టికెట్ల నంబర్లు వేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా మౌలిక వసతులు కల్పించారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయాలు, పలు పాఠశాలల్లో సూపరింటెండెంట్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్ అధికారులు, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్, రూట్ ఆఫీసర్లకు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు పరీక్షలపై తగు సూచనలు, సలహాలు అందించారు. ఇదిలా ఉండగా పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆల్ ది బెస్ట్ తెలిపారు. రాష్ట్రంలోనే ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.



పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

రాజకీయ రగడ

గజ్వేల్ రాజకీయాలు మరోసారి హాట్‌టాపిక్‌గా మారాయి. మాజీ సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్, బీజేపీలు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలకు దిగటమే ఇందుకు కారణం. గురువారం డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కలెక్టరేట్ నుంచి రాజ్‌భవన్ వరకు కేసీఆర్‌కు వ్యతిరేకంగా 'పోరుబాట' పేరుతో పాదయాత్రకు శ్రీకారం చుట్టడం రాజకీయ ప్రకంపనలు సృష్టించడమేకాక, జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన 'పోరుబాట' పాదయాత్ర

గజ్వేల్: మాజీ సీఎం కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కాంగ్రెస్, బీజేపీలు నిరసన కార్యక్రమాలను హోరెత్తిస్తున్నాయి. తన సొంత నియోజకవర్గం గజ్వేల్ ప్రజలకు కేసీఆర్ అందుబాటులో ఉండకపోవడం.. సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, అసెంబ్లీలో తమ సమస్యలపై గొంతెత్తడం లేదని ఆరోపిస్తూ ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో బుధవారం బీజేపీ నేతల పట్టణంలోని కేసీఆర్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి నిరసన కార్యక్రమం చేపట్టిన సంగతి తెల్సిందే. ఈ ఘటనపై బీఆర్ఎస్ నేతలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం కూడా విదితమే.

యూత్ కాంగ్రెస్ నేతలు సైతం..

కేసీఆర్‌పై యూత్ కాంగ్రెస్ నేతలు సైతం నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అలాగే మల్లన్నసాగర్ నిర్వాసిత కాలనీకి చెందిన యువకుల రెండ్రోజులు కిందట తమ సమస్యలపై కేసీఆర్‌కు బహిరంగ లేఖను విడుదల చేయడం కూడా చర్చనీయాంశంగా మారింది. తాజాగా గురువారం డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఏకంగా సిద్దిపేట కలెక్టరేట్ నుంచి రాజ్‌భవన్ వరకు పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గానికి మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఇతర సీనియర్ నేతలు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రను చేపట్టడం రాజకీయాల్లో ఒక్కసారిగా వేడిని పెంచింది.

కలెక్టరేట్ ఎదుట నిరసన

ముందుగా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. 15నెలలుగా కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కలెక్టరేట్ నుంచి దుద్దెడ మీదుగా కొమురవెల్లి కమాన్ వద్దకు పాదయాత్ర చేరుకుంది. ఇక్కడ రాత్రి బస చేసి శుక్రవారం ఉదయం తిరిగి పాదయాత్రను ప్రారంభించనున్నారు. ఈనెల 24న రాజ్‌భవన్‌కు చేరుకోవడానికి కార్యాచరణ సిద్ధం చేశారు. గవర్నర్‌ను కలిసి కేసీఆర్‌పై ఫిర్యాదు చేయనున్నారు. మొత్తానికి కేసీఆర్‌కు వ్యతిరేకంగా సాగుతున్న కార్యక్రమాలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.

కేసీఆర్ లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ

- తాజాగా డీసీసీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో పోరుబాట
- గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదంటూ విమర్శలు
- కలెక్టరేట్ నుంచి రాజ్‌భవన్ వరకు పాదయాత్ర
- గవర్నర్‌ను కలిసి బీఆర్ఎస్ అధినేతపై ఫిర్యాదుకు కార్యాచరణ

నృసింహుని దర్శించుకుని..

వర్గల్(గజ్వేల్): పాదయాత్ర జయప్రదం చేయాలని, స్థానిక ఎమ్మెల్యే కేసీఆర్ ప్రజలకు అందుబాటులోకి రావాలని ప్రార్థిస్తూ డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆయనకు అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు.

సమస్యలపై కేసీఆర్ గళం విప్పాల్సిందే

సిద్దిపేటరూరల్: సొంత గజ్వేల్ నియోజకవర్గ ప్రజల సమస్యలు కేసీఆర్‌కు పట్టడంలేదంటూ యూత్ కాంగ్రెస్, డీసీసీ ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రం నుంచి డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి ఆధ్వర్యంలో రాజ్‌భవన్ వరకు నాయకులు, కార్యకర్తలతో పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంక్షారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను మూడు సార్లు గజ్వేల్ ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించినప్పటికీ ప్రజలపై ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి గజ్వేల్‌కు ఒక్కసారి కూడా రాకుండా ప్రజా సమస్యలపై పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. గజ్వేల్‌కు వచ్చి ప్రజా సమస్యలు తెలుసుకుని అసెంబ్లీలో చర్చించి పరిష్కరించాల్సి ఉండగా ఫాంహౌస్‌లో ఉంటూ రాజకీయం చేయడం సరికాదన్నారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సిద్దిపేట నుంచి పాదయాత్రగా రాజ్‌భవన్‌కు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

చదువుతోనే మంచి భవిష్యత్తు

- డిజిటల్ బోధనను సద్వినియోగం చేసుకోండి
- పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్
- కలెక్టర్ మనుచౌదరి
- అంతక్కపేట, శనిగరం, కోహెడలో కంప్యూటర్ ల్యాబ్‌ల ప్రారంభం



అంతక్కపేటలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన కలెక్టర్ మనుచౌదరి

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. అక్కన్నపేట మండలం అంతక్కపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం రూ.50లక్షలతో శనిగరం, కోహెడ, అంతక్కపేట ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు సహకరించిన టీఎస్ ఐజీ డైరెక్టర్ అర్చన సురేష్, సేల్స్ ఫోర్సెస్ సంస్థ ప్రతినిధి కిరణ్, నిర్మాణ ఎన్జీఓ ప్రతినిధి మధురీ కనకాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పదవ తరగతి విద్యార్థులందరూ 10జీపీ సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, తహసీల్దార్ అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్రికలను రోజూ చదవాలి

కోహెడ(హుస్నాబాద్): విజ్ఞానాన్ని అందించే దిన పత్రికలను రోజూ చదవాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చెప్పదలుచుకున్నది ఏ భాషలోనైనా కాన్ఫిడెన్స్‌గా చెప్పాలని.. మీరు చెప్పే దానిని బట్టి మీవ్యక్తిత్వాన్ని ఎదుటి వారు అంచనా వేస్తారన్నారు. విద్యార్థులను ఎక్కువగా స్టేజ్‌మీద మట్లాడించాలని ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం నుంచి పరీక్షలకు హాజరు కానున్న పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

సబ్జెక్ట్ అర్థం చేసుకోండి

కోహెడరూరల్(హుస్నాబాద్): పరీక్షల్లో మార్కులు ముఖ్యం కాదని ప్రతి సబ్జెక్ట్ సంపూర్ణంగా అర్థం చేసుకొని నాలెడ్జి పెంచుకోవాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మండలంలోని శనిగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్ ను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ కంప్యూటర్ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు అధికంగా లబ్ధి జరిగేలా బోధన జరగాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పక్కన పెట్టి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయలన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్

తన పొలంలోంచి రోడ్డు వేయొద్దంటూ నిరసన

అక్కన్నపేట(హుస్నాబాద్): తన పొలంలోంచి బీటీ రోడ్డు వేయొద్దంటూ ఓ వ్యక్తి వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. ఈ ఘటన మండల పరిధిలోని గండిపల్లి పంచాయతీ అంబనాయక్‌తండాలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన భానోతు చంద్రు అనే వ్యక్తి స్థానిక మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ఎక్కి దాదాపు నాలుగైదు గంటపాటు హల్‌చల్ చేశాడు. గండిపల్లి నుంచి పంచరాయితండా మీదుగా అంబనాయక్ నుంచి డెక్యానాయక్‌తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆందోళనకారుడు మాట్లాడుతూ ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పచ్చని పొలంలోంచి బీటీ రోడ్డు ఎట్లా వేస్తారని ప్రశ్నించారు. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని, చేసేదిలేక వాటర్ ట్యాంక్ ఎక్కాల్సి వచ్చిందన్నారు. రోడ్డు నిర్మాణ పనులు ఆపకపోతే కిందికి దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నచ్చజెప్పి సదరు వ్యక్తి కిందికి దింపడంతో తండావాసులు ఊపిరిపీల్చుకున్నారు.



అంబనాయక్‌తండాలో వాటర్ ట్యాంక్ ఎక్కిన భానోతు చంద్రు





లక్ష పుష్పార్చన, కోటి రుద్ర పారాయణంలో పాల్గొన్న భక్తజనులు.. పాల్గొన్న మాధవానంద సరస్వతి, మధుసూదనానంద సరస్వతి తదితరులు

కోటి రుద్ర పారాయణం

నాచగిరిలో ఆధ్యాత్మిక వైభవం

బ్రహ్మోత్సవ వేళ నాచగిరీశుని సన్నిధానం కోటి రుద్ర పారాయణాలు, సామూహిక భక్తజన లక్షపుష్పార్చనలతో శోభిల్లింది. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామివారి పర్యవేక్షణలో గురువారం నిర్వహించిన ఈ మహా క్రతువుతో ఆధ్యాత్మికతలు వెల్లివిరిశాయి. 500 మంది రుత్వికులతో కోటి రుద్ర పారాయణాలు, లక్ష్మీసూక్త, పురుష సూక్త పారాయణాలు జరిపారు. భక్తులను ఉద్దేశించి మాధవానంద సరస్వతి స్వామి అనుగ్రహ భాషణం చేశారు.

– వర్గల్(గజ్వేల్)

విద్యకు పెద్దపీట హర్షణీయం

- యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు
- సీఎం, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట వేయడం హర్షణీయమని యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు అన్నారు. విద్యా శాఖకు రూ.23,108 కోట్లు కేటాయించిన నేపథ్యంలో గురువారం జిల్లా గ్రంథాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రి కొండాసురేఖ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశలోనే 55 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు రూ.11వేల కోట్లు మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయగా, నేటి ప్రభుత్వం విద్యారంగాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మూతబడిన పాఠశాలలను సైతం పునః ప్రారంభం చేశారన్నారు.



సీఎం, డిప్యూటీసీఎం ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు

ముగిసిన ఇంటర్ పరీక్షలు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ జనరల్ కోర్సుల విద్యార్థులకు వార్షిక పరీక్షలు ముగిశాయి. విద్యార్థినీ, విద్యార్థులు సరదగా మిత్రులకు వీడ్కోలు చెప్పుకున్నారు. గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 8,711 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 265 మంది గైర్హాజరయ్యారు. జగదేవ్‌పూర్ పరీక్షా కేంద్రంలో ఓ విద్యార్థి కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడటంతో డిబార్ చేశారు. కాగా జిల్లా వ్యాప్తంగా 43 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 13 మంది విద్యార్థులు డీబార్ కావడం మినహా పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఈ సందర్భంగా పరీక్షల కన్వీనర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షలు విజయంతంగా నిర్వహించడంలో సహకరించిన సీఎస్‌లు, డీఓలు, స్క్వాడ్ సభ్యులు, హెచ్‌పీసీ, డీఈసీ సభ్యులు, కస్టోడియన్లతో పాటు పోలీస్, పోస్టాపీస్, రెవెన్యూ, ఆర్టీసీ తదితర విభాగాల అధికారులు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



పరీక్ష రాసి సెంటర్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



మెడల్స్‌తో రిశ్వంత్

హుస్నాబాద్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన రిశ్వంత్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. గురువారం సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అండర్ 16 బాలుర విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, 100 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించాడు. 23న హైదరాబాద్ గార్డియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రిశ్వంత్ పాల్గొనన్నుట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా



డంప్ చేసిన ఇసుక

కోహెదరూరల్(హుస్నాబాద్): కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి శివారులోని ఓ పౌల్ట్రీ ఫామ్ సమీపంలో బుధవారం రాత్రి 200 టన్నుల ఇసుక మాయమైపోయింది. మోయెతుమ్మెద వాగు నుంచి సుమారు 100 ట్రాక్టర్ల ఇసుకను అధికారుల కళ్లు కప్పి పగలు పౌల్ట్రీ ఫామ్ సమీపంలో డంప్ చేశారు. రాత్రి పూట సుమారు 10 లారీల్లో సిద్దిపేట, హైదరాబాద్ ప్రాంతాలకు తరలించారు. ఇలా వారం రోజులుగా మండలంలో టన్నుల కొద్ది ఇసుక అక్రమంగా డంప్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గంజాయి విక్రేత అరెస్ట్

మనోహరాబాద్(తూప్రాన్): గంజాయి అమ్ముతున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఇతర రాష్ట్రానికి చెందిన సర్కార్ పార్థు అనే యువకుడు మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ పరిశ్రమల వాడలో కార్మికులకు గంజాయి అమ్ముతున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం మెదక్ టాస్క్‌ఫోర్స్ సీఐ గోపాల్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి యువకుడిని పట్టుకున్నారు. అతడి వద్ద 205 గ్రాముల గంజాయితోపాటు , బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూర్ జిల్లాకు చెందిన సాధు రవితేజ(36) శేరిలింగంపల్లి పరిధిలోని జవహర్ నగర్ కాలనీలో కుటుంబంతో ఉంటున్నాడు. పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని గ్లాండ్ ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్నారు. రోజు మాదిరిగానే బైక్‌పై డ్యూటీకి బయలుదేరాడు. లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తుండగా రామచంద్రాపురం డీమార్ట్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన రెడీమిక్స్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవితేజ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


బాలికపై అత్యాచారం

- వరుసకు బాబాయే నిందితుడు
- ఘటన ములుగు మండలం

ములుగు(గజ్వేల్): బాలికపై వరుసకు బాబాయే అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ములుగు మండలం బహిలంపూర్ ఆర్ అండ్ఆర్ కాలనీలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన బాలికకు తల్లి చనిపోగా తండ్రి ఉన్నాడు. బాలిక అమాయకత్వంగా వ్యవహరిస్తుంటుంది. బాలిక అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్నాడు వరుసకు బాబాయి అయిన పెంటమీది స్వామి(40). ఆమెకు చాక్ లెట్ ఇస్తానని ఇంటిలోకి రప్పించుకొని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక చుట్టుపక్కల వారికి చెప్పడంతో గ్రామస్తులు స్వామిని చితకబాది దేహశుద్ధి చేశారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ మేరకు స్వామిపై కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు.



నర్సాపూర్ రాయరావు చెరువు



నర్సాపూర్ అడవుల గుండా పారుతూ వచ్చే పంది వాగు

ఆహ్లాదం.. ఆందోళనమయం

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో ప్రభుత్వం డంప్‌యార్డు ఏర్పాటు చేస్తుండగా దాని నుంచి వచ్చే కలుషితం నర్సాపూర్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇక్కడి వాతావరణం, జలాలు, అడవులు కలుషితమవుతాయన్న భయాందోళనలు అన్ని వర్గాల ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– నర్సాపూర్:

- నర్సాపూర్‌పై గుమ్మడిదల మండలం ప్యారానగర్ డంప్‌యార్డు ప్రభావం
- అడవులు, జలాశయాలు కలుషితం
- వ్యవసాయరంగం, మత్స్యరంగం ఉనికి కోల్పోయే అవకాశం
- దుర్వాసనతో నిండిపోనున్న పరిసర ప్రాంతాలు
- వ్యతిరేకిస్తున్న ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు

హెచ్ఎండీఏ నుంచి రోజుకు రెండు వేల టన్నుల చెత్త సేకరించి ప్యారానగర్ డంప్‌యార్డుకు తెచ్చి రీసైక్లింగ్ చేస్తారని, గ్యాస్ ఉత్పత్తి చేస్తారని ప్రచారం జరుగుతోంది. చెత్త నుంచి ఏమి తయారు చేసినా వచ్చే దుర్వాసనతో ప్యారానగర్‌తోపాటు నర్సాపూర్ అడవులు వాయు కాలుష్యమయంగా మారుతాయి. పచ్చని అడవులు సైతం ఆగమయ్యే అవకాశం ఉంది. నర్సాపూర్‌లోని అర్బన్ పార్కు పర్యాటక పరంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుంది. దీన్ని మరింత పర్యాటకంగా చేయాలన్న లక్ష్యంతో అధికారులు కోట్ల రూపాయలు వెచ్చించి అందులో కాటేజీలు నిర్మిస్తున్నారు. స్థానిక అడవులు కాలుష్యమైతే అర్బన్‌పార్కును పర్యాటక రంగంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోయే ప్రమాదం ఉంది.

ప్రధాన వనరుతోపాటు చెరువు కలుషితం

ప్యారానగర్‌కు కొద్ది దూరం వరదలు మొదలై పారుతూ వచ్చే వాగును పంది వాగుగా పిలుస్తారు. పంది వాగు నర్సాపూర్ రాయరావు చెరువుకు ప్రధాన వనరుగా కొనసాగుతోంది. సుమారు నాలుగు కిలోమీటర్లు అడవిలో ప్రవహించి నర్సాపూర్ చెరువులో కలుస్తుంది. అటవీ శాఖ పంది వాగుపై రెండు చెక్ డ్యాంలు నిర్మించి నీరు నిల్వ ఉండే విధంగా చర్యలు చేపట్టింది. డంప్‌యార్డు ఏర్పాటు చేస్తే దాని నుంచి వచ్చే జల కాలుష్యంతో పంది వాగు కాలుష్యమయంగా మారుతుంది. ఈ కలుషిత నీటితో అడవిలోని జంతువులు తగ్గిపోయే ప్రమాదం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

గొలుసు చెరువులన్నీ ఆగం

రాయరావు చెరువు కింద మండలంతోపాటు హత్నూర మండలంలోని సుమారు 10 గొలుసు కట్టు చెరువులుంటాయి. రాయరావు చెరువు నిండి అలుగులు పారితే రాంచంద్రాపూర్, మూసాపేట, కాసాల, సికింద్లాపూర్, కొన్యాల్ తదితర చెరువులు నిండుతాయి. చివరకు మంజీరా వాగులో ఈ నీరు కలిసే అవకాశం ఉంటుంది. రాయచెరువు కలుషితమైతే దీంతోపాటు దాని కింద ఉన్న గొలుసు చెరువులన్నీ కలుషితమయ్యే అవకాశం ఉంది. దీని వల్ల ఆ నీళ్లతో సాగయ్యే వ్యవసాయ పొలాలు దెబ్బతింటాయి. అలాగే చెరువుల్లోని చేపలు చనిపోయే అవకాశం ఉంది.

అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత

డంప్‌యార్డును గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్, కొత్తపల్లి, నల్లవల్లి, గుమ్మడిదల్ల గ్రామాలతో పాటు నర్సాపూర్ ప్రజలు జేఏసీ కమిటీలుగా ఏర్పడి తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాలలో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇటీవల అసెంబ్లీలో డంప్‌యార్డు అంశాన్ని ప్రస్తావించి రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పలువురు నర్సాపూర్, గుమ్మడిదల్ల మండలానికి చెందిన జేఏసీ నాయకులను వెంట తీసుకెళ్లి ఢిల్లీలో అటవీశాఖ డైరెక్టర్ జనరల్ సుశీల్‌కుమార్‌ను, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌లను కలిసి డంప్‌యార్డు అనుమతులను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రజల డిమాండ్‌కు తలొగ్గి డంప్‌యార్డును రద్దు చేస్తుందా, డంప్‌యార్డును కొనసాగిస్తుందా వేచి చూడాలి.

డంప్‌యార్డును రద్దు చేయాలి



ప్రస్తుతానికి డంప్‌యార్డుపై కోర్టు స్టే ఉంది. డంప్‌యార్డుతో రాబోవు తరాలకు అనేక నష్టాలు సంభవిస్తాయి. వాయు కాలుష్యం జల కాలుష్యంతోపాటు అడవులు పాడయ్యే ప్రమాదం ఉంటుంది. ప్రజల అభీష్టం మేరకు ఇటీవల తాను అసెంబ్లీలో డంప్‌యార్డు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరాను. డంప్‌యార్డుతో అనేక విధాలుగా నష్టాలు ఉంటాయి. డంప్‌యార్డుకు కేటాయించిన భూములను సర్వే చేసి ప్రభుత్వ భూములు ఉంటే పేదలకు పంచాలి.

– సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

చెరువులు కలుషితమవుతాయి



ప్యారానగర్ డంప్‌యార్డుతో నర్సాపూర్ అడవులతోపాటు పలు చెరువులు కలుషితమవుతాయి. ప్రశాంతంగా ఉన్న నర్సాపూర్ అడవులు, పట్టణం కలుషితమయంగా మారితే ప్రజలు అస్వస్థతలకు గురవుతారు. చెరువుపై ఆధారపడే వ్యవసాయరంగం, మత్స్యరంగం ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంది. తమ వంతుగా ఎంపీ రఘునందన్‌రావు ద్వారా డంప్‌యార్డు రద్దు కోసం తమ వంతు కృషి చేస్తున్నాం అందులో భాగంగా కేంద్ర మంత్రి, కేంద్ర అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నాం.

– మురళీయాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

సీఎం దృష్టికి తీసుకెళ్తాం



డంప్‌యార్డు విషయాన్ని జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ప్రజల అభిష్టాలను వివరించి డంప్‌యార్డు ఇక్కడి నుంచి ఎత్తివేయాలని కోరనున్నాం. గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతోనే డంప్‌యార్డు ఏర్పాటు చేస్తున్నారే తప్ప తమ ప్రభుత్వ తప్పు ఏ మాత్రం లేదు.

– ఆంజనేయులుగౌడ్, డీసీసీ అధ్యక్షుడు

దేవుడి దర్శనానికి వెళ్లొస్తుండగా ట్రాక్టర్ బోల్తా

ఇద్దరికి తీవ్ర, మరో 12 మందికి స్వల్ప గాయాలు



పొలంలో బోల్తా పడిన ట్రాక్టర్

దుబ్బాకటౌన్ : ట్రాక్టర్ బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని రేకులకుంట సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మిరుదొడ్డి మండలం మల్లుపల్లి, రుద్రారం గ్రామానికి చెందిన 20 మంది బంధువులు ట్రాక్టర్‌లో రేకులకుంట మల్లికార్జున స్వామి ఆలయ దర్శనానికి వచ్చారు. గురువారం తెల్లవారు జామున తిరుగు ప్రయాణం కాగా రేకులకుంట సమీపంలోకి రాగానే రోడ్డుపై గుంతను తప్పించబోయే క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఇందులో మంతూరి కనకయ్యకు పక్కటెముకలు, లక్ష్మీ (70) చేతికి తీవ్ర గాయాలు కాగా, మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటన పై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ గంగరాజు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు
- డాక్టర్లు లేక గంటపాటు ఆస్పత్రి వద్దే, మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



ఆస్పత్రి ఎదుట గాయాలతో బీరయ్య

మద్దూరు(హుస్నాబాద్): వైద్యులు అందుబాటులో లేక వ్యక్తి మృతి చెందిన ఘటన లద్నూరు ప్రభుత్వాస్పత్రి వద్ద చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మద్దూరు మండల పరిధిలోని లద్నూర్ గ్రామానికి చెందిన కేమిడి బీరయ్య(65) గురువారం బోరు మోటారు మరమ్మతుల కోసం జనగామకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో లద్నూరు గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే బీరయ్యను లద్నూరు గ్రామంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ సమయానికి ఆస్పత్రిలో వైద్యులు లేక గంటపాటు అక్కడే ఉన్నారు. అనంతరం 108 ద్వారా చేర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సరైన సమయంలో వైద్యం అందకనే బీరయ్య ప్రాణాలు కోల్పోయాడని గ్రామస్తులు, బంధువులు ఆరోపించారు. మద్దూరు ఉమ్మడి మండలంలోనే 12 పడకలతో 24 గంటలపాటు నడిచే ఏకైక లద్నూరు ఆస్పత్రిలో వైద్యులు నిత్యం ఉండాలి. కానీ సిబ్బంది సక్రమంగా ఉండకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టి

- జహీరాబాద్‌లో జరిగిన కారు ప్రమాదంలో ఒకరు మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు



డివైడర్‌ను ఢీకొన్న కారు

జహీరాబాద్: కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. రంజాన్ పండుగ కోసం మహబూబ్‌నగర్‌కి జిల్లా చెందిన వారు అవసరమైన సామగ్రిని ముంబాయిలో కొనుగోలు చేసుకొని కారులో గురువారం తిరుగు ప్రయాణం అయ్యారు. జహీరాబాద్ పట్టణంలోని బైపాస్ రోడ్డుపై పాత చెక్ పోస్టు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఖాజా ఫరీదుద్దీన్(34) తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మరో నలుగురు అలిముద్దీన్, నాసిర్, ముదాసిర, రజియుద్దీన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు జహీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ప్రమాదంలో యువకుడు మృతి మరొకరికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. గజ్వేల్ మండలంలోని దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన క్యాసారం బాబు(26), అతడి స్నేహితుడు బోనాల యాదగిరి(26) కలిసి గురువారం బైక్‌పై కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్ గ్రామానికి వెళ్లారు. ఓ వ్యక్తి డబ్బులు ఇచ్చేది ఉండటంతో తీసుకొని తిరుగు ప్రయాణమయ్యారు. కుకునూరుపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దకి రాగానే బైక్ అదుపుతప్పి రాజీవ్ రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బాబుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, యాదగిరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు యాదగిరిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి చిన్నాన్న వెంకటయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



బాబు మృతదేహం

పెండింగ్ కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలి

సిద్దిపేట సీపీ అనురాధ

హుస్నాబాద్ డివిజన్ పోలీసులతో సమీక్ష



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా డిస్పోజల్ చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సీపీ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐలు శ్రీనివాస్, శ్రీను, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విషాదంగా మారిన విహారయాత్ర

- ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును ఢీకొన్న డీసీఎం
- ఇద్దరు మహిళలు మృతి, మరో నలుగురికి గాయాలు
- కోళాపల్లి వద్ద ఘటన



ప్రమాద స్థలంలో డీసీఎం, ట్రావెల్స్ బస్సు

పెద్దశంకరంపేట(మెదక్): ట్రావెల్స్ బస్సును డీసీఎం ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు చెందారు. ఈ ఘటన పెద్దశంకరంపేట మండలం కోళాపల్లి వద్ద 161వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. విజయనగరం జిల్లా చీపురుపల్లి, ఆకులపల్లి, పెనుబర్తి, కోమారం గ్రామాలకు చెందిన 40 మంది యాత్రికులు శ్రీ బాలాజీ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సులో తొమ్మిది రోజుల కిందట బయలుదేరి యాదగిరిగుట్ట, షిర్డీ, తుల్జాపూర్‌లో దర్శనం చేసుకున్నారు. అనంతరం చిలుకూరు బాలాజీ, శ్రీశైలంకు వెళ్తుండగా కోళాపల్లి వద్ద టిఫిన్ చేద్దామని ఆగారు. ఇదే సమయంలో నిజాంపేట వైపు నుంచి నిద్రమత్తులో వస్తున్న డీసీఎం వాహనం డ్రైవర్ కాల్ భీమ్ అతివేగంగా వచ్చి యాత్రికులను, బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మీసాల అప్పల నారాయణమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలైన దేవీప్రియ, పవన్, రవుతూ సూరప్పమ్మ, అప్పల నాయుడు, లక్ష్మిని హైవే సిబ్బంది అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రవుతూ సూరప్పమ్మ మృతి చెందింది. బస్సు డ్రైవర్ రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను వారి స్వగ్రామానికి తరలించి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు. డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

మహిళ మృతదేహం లభ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల పరిధిలోని కొండపోచమ్మ ఆలయం సమీపంలో గురువారం గుర్తు తెలియని మహిళ (యాచకురాలు) మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ చంద్రమోహన్ కథనం మేరకు.. రెండు నెలల కిందట హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చి ఆలయం వద్ద చిన్న గుడారంలో నివాసం ఉంటూ భిక్షాటన చేస్తూ జీవిస్తుంది. గురువారం ఆమె చనిపోయినట్లు గ్రా మస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి వయస్సు 60 ఉంటుందని, ఒంటిపై నేవీ బ్లూ కలర్ టీ షర్టు, పర్పుల్ కలర్ లంగా కలదని, ఎవరని ఆరా తీయగా ఎటువంటి వివరాలు లభించలేదని ఎస్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఉపాధి హామీ అక్రమాల్లో రారాజు

- నాగసముద్రాలలో ఫీల్డ్ అసిస్టెంట్ మాయ
- పనుల్లో నిత్యం అవకతవకలు
- పనికి రాకున్నా ఖాతాల్లో డబ్బులు
- ఇదేంటని అడిగిన వారికి పని రద్దు
- రూ.లక్షలు కాజేసినట్లు ఆరోపణలు
- ప్రజావాణిలో గ్రామస్తుల ఫిర్యాదుతో వెలుగులోకి అక్రమాలు



గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులు

కోహెదరూరల్(హుస్నాబాద్) : జాతీయ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. లేని చెట్లను ఉన్నట్టుగా చూపించి.. వాటిని కూలీలతో సంరక్షిస్తున్నామని రికార్డులు తారుమారు చేసి రూ.వేలల్లో నొక్కేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.. పని జరగకుండానే జరిగినట్టుగా చెప్పి కూలీకి రాని వారిని వచ్చినట్లు మస్టర్ లో చూపించి ఏటా రూ.లక్షల్లో దోచేయడం అలవాటు. గ్రామంలో లేని వారు.. దూర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారు.. కూలీ పనికి రాని వారి పేర్లతో దోపిడీకి పాల్పడ్డాడు కోహెడ మండలం నాగసముద్రాల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కొడముంజ రాజు. ఇదేంటని అడిగిన వారికి కూలీ పని లేకుండా చేస్తున్నాడు. దీంతో ఏళ్ల తరబడి ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాల చిట్టా బ్యాంక్ బ్యాలెన్స్‌లా పెరిగిపోతూనే ఉంది.

కూలి పనికి రాకున్నా హాజరు

కోహెడ మండలం నాగసముద్రాల గ్రామానికి చెందిన కొడముంజ రాజు ఎనిమిదేళ్లుగా జాతీయ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. పనుల వివరాలను చూసుకొని కూలీలతో పనులు చేయించి, వారికి హాజరు వేసి బ్యాంక్ లో కూలీ సొమ్ము పడేలా చూడటం అతని విధి. కానీ లేని పనిని ఉన్నట్టుగా చూపడం, బోగస్ మస్టర్‌లు వేయడం, బినామీల పేర్లపై జాబ్ కార్డు సృష్టించి కూలీల సొమ్మును తన వైపు మళ్లించడం చేశాడు. తన దగ్గరి వారు కూలి పనికి రాకున్నా హాజరు వేయడం వచ్చిన సొమ్ములో సగం తీసుకోవడం మొదలు పెట్టాడు. ఇదేంటని ప్రశ్నిస్తే అడిగిన వారికి పని లేకుండా చేస్తున్నాడు. ఇతడి భార్య మాజీ ఎంపీటీసీ ఆమె ఒక్కరోజు పనికి రాకున్నా ప్రతీ నెల వచ్చినట్టు చూపించి రూ.వేలల్లో సొమ్ము కాజేశాడు. కూమారుడి పేరు పై జాబ్ కార్డు సృష్టించి తప్పుడు మస్టర్ రాసి సొమ్ము పక్కదారి పట్టించాడు. తన కింద 5 మంది మేటీలను పెట్టుకొని అక్రమాలు చేస్తున్నాడు. ఇలా రూ.లక్షలు కాజేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

అధికారులకు వాటాలు

ఈ అక్రమాల్లో అధికారులకంటూ వాటా ఉందని, ఏపీఓ, ఎంపీడీఓ కనీసం పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. గ్రామస్తులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఒక్కరోజైన విచారణ చేయలేదు. వారికి వాటాలు అందడంతోనే పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉపాధిలో జరిగిన అక్రమాలపై గత సోమవారం ప్రజావాణిలో గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఫిర్యాదు చేసిన సాయంత్రమే ఈ విషయంపై విచారణ చేయాలని ఏపీఓ, ఎంపీడీఓకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికైనా క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదు వాస్తవమే

నాగసముద్రాల గ్రామంలో ఉపాధి హామీలో అక్రమాలు జరిగినట్టు మా దృష్టికి వచ్చింది. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన దానిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఒకే ఇంట్లో ఇద్దరికి జాబ్ కార్డులు ఉండకూడదు. అలాంటి వాటిని తొలగించి అవినీతి జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– రంగనాయక్, ఏపీఓ, కోహెడ

ప్రహరీగోడ వివాదం

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కొండపాక(గజ్వేల్): ప్రహరీ గోడ నిర్మాణంలో వచ్చిన ఫిర్యాదుపై మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు ఈ సంఘటన కుకునూరుపల్లిలో గురువారం చోటు చేసుకుంది. తిప్పారం గ్రామానికి చెందిన చిలుముల సత్యనారాయణ అలియాస్ డేవిడ్ రాజ్ కుకునూరుపల్లిలో నూతనంగా ఇంటిని నిర్మించుకొని నివాసం ఉంటున్నాడు. నిర్మాణ సమయంలో సత్యనారాయణ ఇంటి పక్కన ఉన్న శ్రీశైలంతో గోడ నిర్మాణ విషయంలో గొడవ పడ్డారు. గోడ ఇద్దరికి వర్తింస్తుదంటూ పెద్దమనుషులు చెప్పి గొడవను సద్దుమణిగేలా చేశారు. ఈ క్రమంలో శ్రీశైలం నూతనంగా ఇంటిని నిర్మాణం చేస్తున్న క్రమంలో ప్రహరీ గోడను నిర్మించే క్రమంలో తన సొంత గోడను ఆనుకొని ప్రహరీ గోడ నిర్మిస్తున్నాడంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ శ్రీనివాస్ పరిశీలించి.. గోడను తాకకుండా నిర్మించుకోవాలని చెప్పి వచ్చాడు. ఆ గోడపై ఇద్దరికి హక్కు ఉంటాయన్న పెద్ద మనుషుల సూచనలకు అనుగుణంగా శ్రీశైలం ప్రహరీ గోడను తాకుడూ నిర్మాణం చేపడుతున్నాడు. ఈ విషయమై సత్యనారాయణ మళ్లీ పోలీస్టేషన్‌ను ఆశ్రయించాడు. కానిస్టేబుల్ వెళ్లి పోలీస్టేషన్‌కు రావాలని చెబుతుండగానే.. శ్రీశైలం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి, అక్కడి నుంచి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, ఎస్ఐ వేధిస్తుండటంతోనే తన భర్త ఆత్మహత్యకు యత్నించాడని శ్రీశైలం భార్య వసంత ఆరోపించింది.

యువకుడు అదృశ్యం

సంగారెడ్డి క్రైమ్: ఇంటి నుంచి వెళ్లి యువకుడు అదృశ్యమైన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని కిందిబజారుకు చెందిన చింబోలి అరుణ్ (27) నిత్యం మద్యం సేవిస్తుండటంతో తల్లిదండ్రులు మందలించారు. కోపంతో 8వ తేదీన ఇంటి నుంచి వెళ్లి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం అరుణ్ తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిస్తే 87126 61830 నంబర్లకు తెలియజేయాలని సీఐ పేర్కొన్నారు.